మర్రిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యేలు

మర్రిజనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే పుట్ట మధు

తిమ్మాజీపేట, డిసెంబర్ 26 : తండ్రిని కోల్పోయిన మాజీఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని పలువురు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని నేరళ్లపల్లి లోని ఆయన ఇంటికి గురువారం మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పరామర్శించి జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు సురేందర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నల్లమలను టూరిజం హబ్‌గా మార్చేందుకు దృష్టి

- రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, డీఎఫ్‌వో

అచ్చంపేట, డిసెంబర్ 26: రాష్ట్రంలోని అటవీప్రాంతాలు, ప్రముఖ ఆలయాలను ప్రత్యేకంగా టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా పాలసీని రూపొందించి సీఎంకు నివేదించామని రాష్ట్ర అటవీశాఖ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శ్రీశైలం స్వామివారి దర్శనం కోసం వెళ్తుండగా మార్గమధ్యలో మన్ననూర్‌లో గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీఎఫ్‌వో రోహిత్‌రెడ్డి, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం అటవీశాఖ గెస్ట్ హౌజ్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ నల్లమలలో చేపట్టాల్సిన టూరిజం అభివృద్ధి ఇతర అంశాలను మంత్రిదృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్‌వో రోహిత్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అడవిని, జంతువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోతుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, అటవీభూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతుల జోలికి అటవీశాఖ అధికారులు వెళ్లరాదన్నారు. దేవాదాయశాఖకు చెందిన మాన్యాలభూములను తిరిగిస్వాధీనం చేసుకుంటున్నామని, ఆక్రమించిన వారిపై చట్టపరంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అక్కమహాదేవి గుహను టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, సోమశిల–అమరగిరి అభివృద్ధి కోసం ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.కోటి 25లక్షలు మంజూరు చేశామన్నారు. ఆరుసఫారీ వాహనాలు కొనుగోలు చేసి సఫారీ సేవలు ప్రారంభించనున్నామన్నారు. ఎలివెటేడ్ కారిడార్ రూ.7700 కోట్లతో 58కిలో మీటర్ల నిర్మాణం చేపట్టనుండగా అందులో 42కిలోమీటర్లు నల్లమల అటవీప్రాంతం గూండా వెళ్తుందన్నారు. దీనికి కావల్సిన వివరాలు పంపించాలని కేంద్రప్రభుత్వం అడుగగా అటవీశాఖ అధికారులు నివేదిక పంపించారన్నారు. డీఎఫ్‌వో బాగా పనిచేస్తున్నారని మంత్రికితాబిచ్చారు. అనంతరం మన్ననూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హంస ఎకో రిసార్ట్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మల్లేశ్, కాశన్న యాదవ్, చత్రూనాయక్, వెంకటయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తరలిన జిల్లాజట్టు

రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్న జిల్లా కబడ్డీ జట్టు

కల్వకుర్తి రూరల్, డిసెంబర్26 : జనగాం జిల్లాలో 27 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జూనియర్స్ బాలురకబడ్డీ జట్టు గురువారం కల్వకుర్తి నుంచి తరలారు. ఈ సందర్భంగా వారికి గురువారం ఉదయం గ్రౌండ్‌లో ప్రాక్టీస్ అనంతరం స్పోర్ట్స్‌డ్రస్‌లను అందించి అభినందించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ యాదయ్య గౌడ్ మ్యాకల శ్రీనివాసులు, పీడీలు ప్రకాశ్, మోహన్, రమేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి ..

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 26 : వారంరోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టిన ఘటనలో చికిత్సపొందుతూ వ్యక్తి గురువారం మృతిచెందగా కుటుంబీకులు, బంధువులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేసిన ఘటన అచ్చంపేటలో చోటుచేసుకున్నది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన సభావత్ బాలు(42) తన భార్యను ద్విచక్ర వాహనం ఎక్కించుకొని వెళ్తుండగా నక్కర్ల పెంట తండాకు చెందిన పాత్లావత్ అంజి తన మారుతి సుజుకి టీఎస్07 యుకె7996 నెంబరు కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా, తీవ్రగాయలైన బాలు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్సై తెలిపారు. ఈ విషయంలో కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఎదుటఆందోళన చేయడం సరికాదని ఫిర్యాదు అందిన వెంటనే కేసునమోదు చేయడం జరిగిందన్నారు. ఏమన్న ఉంటే కోర్టు ఇరువురు చూసుకోవాలని సాధారణ ప్రజానీకానికి రోడ్డుపై ఆటంకం కలిగించడం సరికాదన్నారు. దీంతోబాధిత కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

ఘనంగా ఎల్వీప్రసాద్ నేత్ర కేంద్రం వార్షికోత్సవం

కేక్ కట్ చేస్తున్న వైద్యసిబ్బంది

కోడేరు, డిసెంబర్ 26 : మండల కేంద్రంలో ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్య ఉప కేంద్రమైన రంగినేని కమలమ్మ రఘుపతిరావు కంటి పరీక్షా కేంద్రం మూడో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ నర్సింహ సిబ్బంది కొత్తపల్లి రాజు, కొమారి వెంకటయ్యలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేండ్ల కాలంలో దాదాపు 12,360 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారని, అందులో 1632 మందికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందని 1196 మందికి కంటి శుక్లాలు ఉన్న వారిని తూడుకుర్తిలోని రామచంద్రారెడ్డి నేత్ర వైద్య కేంద్రానికి పంపించారన్నారు.

నిరుద్యోగులపై పన్నుల భారం తగదు

- కేంద్రం దరఖాస్తుల వసూలు రద్దు చేయాలి
- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన

జీఎస్టీపై నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 26 : కేంద్రప్రభుత్వం నిరుద్యోగులపై పన్నుల భారాలు మోపడం తగదని నియామకాల దరఖాస్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా నేత నాగపూర్ మధు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక దరఖాస్తులపై జీఎస్టీ వసూలు చేయడాన్ని ఉపసంహరించుకుని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగాలు ఇవ్వడం చేతకాని కేంద్ర ప్రభుత్వం నియామక దరఖాస్తు ఫారాలపై జీఎస్టీను వసూలు చేయాలను కోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఎన్నడూ లేని విధంగా అన్ని వస్తువులపై పన్నుల భారాలను మోపుతూ ఆఖరికి నిరుద్యోగులను కూడా వదలట్లేదన్నారు. ఇప్పటికే తల్లిదండ్రులు ఎన్నో ఆశలను వదులుకుని తమ పిల్లలను చదివిస్తుంటే బీజేపీ ప్రభుత్వం యువతను ఉద్యోగాలకు దూరం చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతిని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల అన్ని దరఖాస్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని ఆయన హెచ్చరించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్, నాయకులు నవీన్, కుర్మయ్య, నరేశ్, మల్లేశ్, అంజి, శివ, రాజు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూలై నాటికి కేఎల్ఐ పనులు పూర్తి చేయాలి

- కేఎల్ఐ జేఏసీ చైర్మన్ రాంచంద్రారెడ్డి

కల్వకుర్తి, డిసెంబర్ 26 : జూలై 2025 నాటికి ఎంజీకేఎల్ఐ పనులను పూర్తి చేయాలని కేఎల్ఐ రైతు జేఏసీ చైర్మన్ రాంచంద్రరెడ్డి ప్రభుత్వానికి గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కేఎల్ఐ ప్రాజెక్టు ప్రారంభించి 20ఏండ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ పనులు పూర్తికాకపోవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ లైనింగ్ పనులు ఇప్పటివరకు మొదలు పెట్టలేదని, పిల్లకాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, దురదృష్టం ఏమిటంటే పిల్లకాల్వలకు సంబంధించి ఇప్పటివరకు భూ సేకరణ పనులు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉంటే వాటిని వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేజర్ కాల్వకు సంబంధించి లైనింగ్ పనులకు పిల్లకాల్వలు పూర్తికి, భూసేకరణకు ఎంతడబ్బు ఖర్చవుతుందో పూర్తి స్థాయిలో అధికారులు లెక్కలు వేసి ప్రభుత్వం ముందు ఉంచాలని, 2025 వేసవిలో పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మరాజు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబర్ 26 : ఎస్ఎస్ఏ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగస్తులు 17రో జులుగా రెగ్యులరైజ్ చేయాని కోరుతూ సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఇంజినీర్లుగా డాక్టర్లుగా, మేధావులుగా అత్యున్నతమైన ఉన్న భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుతున్నటువంటి వీరిని రెగ్యులరైజ్ చేయకపోవడం సరైనది కాదన్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా ఏకశిలా పార్కులో ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని ఇచ్చిన హామీకి అనుగుణంగా వెంటనే వీరిని రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని సీఎం కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యోగస్తుల జిల్లా అధ్యక్షుడు మురళి, కార్యదర్శి విష్ణు, కోశాధికారి అశోక్, రమాదేవి, విజయ, లత, సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఫోరం రాష్ట్రఅధ్యక్షుడు ధర్మరాజు

మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబర్ 26 : వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన తెలకపల్లి మండలం ఆలేరు గ్రామానికి చెందిన రాములమ్మ మృతదేహాన్ని గురువారం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించి ఘటనా వివరాలను కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. దవాఖానలో చేర్చిన సకాలంలో వైద్యం అందించక పోవడం వల్లే భార్య మృతి చెందిందని, మృతురాలి భర్త ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఇలాంటి ఘటనలు నియోజకవర్గంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతు లబ్ధిదారులకు మంజూరైన స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే అందజేశారు.

'గృహలక్ష్మి' అర్హులైన ప్రతిఒక్కరికీ అమలుచేయాలి

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 26 : ప్రభుత్వం అమలుచేస్తున్న గృహలక్ష్మి పథకాన్ని ప్రతిగ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేనా అని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి పాలన దృష్టి సారించి పథకాలు అమలయ్యేలా వారు కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శతజయంతి వేడుకల ప్రదర్శన

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 26 : సీపీఐ పార్టీ డిసెంబరు 26 నాటికి భారత దేశంలో పురుడు పోసుకుని 100ఏండ్ల అవుతున్నందున సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు శత జయంతి ఉత్సవాలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో తిరుగుతూ బస్టాండ్ ఎదురుగా జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రసమితి సభ్యులు ఆనంద్‌జీ అధ్యక్షతన సభనుద్దేశించి రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ ప్రసంగించారు. ఈ సందర్భంగా గడిచినా వందేండ్ల భారత ముఖ చిత్రం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని కులం, మతం, ప్రాంతం, భాష అంశాలతో ప్రభావితమై రాజకీయ పార్టీలు అనేక పరిణామాలను సృష్టించాయన్నారు. ప్రజల మధ్య ప్రజా ఉద్యమాల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్, వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహ, ఏసయ్య, ఇంద్ర, విజయ, ఈర్ల చంద్రమౌళి, జిల్లా సమితి నాయకులు శంకర్ గౌడ్ కృష్ణాజీ, ప్రజా సంఘాలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాయమాటలతో మోసం చేస్తున్న ప్రభుత్వం

చారకొండ, డిసెంబర్ 26 : మాయమాటలతో కాలం గడుపుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చినతర్వాత వాటిని అమలు చేయకుండా మభ్య పెడుతున్నారన్నారు. ఆరుగ్యారెంటీలు ఎన్నికల్లో గొప్పగా ప్రచారం చేసి తీరా చూస్తే సమగ్రంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ చేసి తీరుతామని చెప్పి అసంపూర్తిగా చేసి అందరికి చేశామని చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. రైతుభరోసాపై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. సీఎం, మంత్రులు హామీలపై పొంతన లేని వాగ్ధానాలు చేస్తున్నారని, ఇండ్లసర్వే పేరుతో మరో సారి మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని నమ్మే పరిస్థితులో లేరన్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. త్వరలోనే పార్టీ శతజయంతి ఉత్సవాలకు రైతులు, కార్మికులు, అభిమానులు, నిరుద్యోగ యువతపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి అశోక్‌గౌడ్, మద్దినారాయణరెడ్డి, బాలయ్య, మొగిళ్ల శ్రీను పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట, డిసెంబర్ 26 : కొన్నిరోజులుగా సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ బేషజాలకు పోకుండా చర్చలు జరిపి సమ్మె విరమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంఘం మురళి, కొత్త శ్రీధర్‌రావులు ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పదోతరగతి పరీక్షల సిలబస్ పూర్తి చేసే సందర్భంలో విద్యార్థులకు నష్టం జరుగుతుందని, 17 రోజులగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి మినిమం టైంస్కేల్ ఇవ్వాలని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిన్న స్థాయి ఉద్యోగులు అంటూ చిన్న చూపు చూడకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేయాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

ఉమామహేశ్వర ప్రాజెక్టు డిజైన్ మార్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

బల్మూరు, డిసెంబర్ 26 : ఉమామహేశ్వర ప్రాజెక్ట్ డిజైన్ మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతలో అందరు చిన్నసన్నకారు రైతులు ఉన్నారని పేదరైతుల భూములు కోల్పోకుండా ప్రాజెక్ట్ డిజైన్ మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే వంశీకృష్ణను కోరారు. భూములను కోల్పోతే ఆ రైతులను గుర్తించి వేరో చోట భూములను ఇప్పించాలని సూచించారు. ప్రాజెక్ట్ లాభం కన్న నష్టం అధికంగా జరుగుతుందన్నారు. ఎక్కువనష్టం జరిగేది పేదలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. దొరల, రెడ్ల భూములు కోల్పోకుండా ఉండడం దారుణమన్నారు. ఎమ్మెల్యేలు, ఎవరు ఉన్న దొరలకు, రెడ్లకు ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామాల్లో వారి అరాచకాలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పేదలకు అండగా సీపీఎం ఉంటుందన్నారు. ప్రాజెక్టు అవసరమైతే అటవీప్రాంతలో నిర్మాణం చేస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగదని ఆయన ఎమ్మెల్యేకు సూచించారు. ఇతర మండలాలకు నీరు తీసుకపోవడం కోసం బల్మూరు, అనంతవరం గ్రామల రైతుల భూములకు నష్టం వాటిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం తప్పక మార్పు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దేశ్యానాయక్, ఆంజనేయులు, శంకర్‌నాయక్, బాలు, మహేందర్, లాలహ్మద్, బాలు తదితరులు ఉన్నారు.

బల్మూరులో మాట్లాడుతున్న పర్వతాలు

కేజీబీవీ కళాశాల భవనం నాణ్యతగా చేపట్టాలి

- ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్

చారకొండ, డిసెంబర్ 26 : మండల కేంద్రంలో కేజీబీవీ నూతన కళాశాల భవన నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టాలని ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నేనావత్ రవినాయక్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు విద్యార్థులకు ఉపయోగపడే కళాశాల భవనాన్ని నాసిరకంగా నిర్మిస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యతగా నిర్మించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

స్పీడ్‌బోట్లు ఏర్పాటు చేయిస్తాం

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 26 : మండలంలోని సింగోటం గ్రామంలో జనవరి 17వ తేదీన జరిగే శ్రీలక్ష్మీ నర్సింహస్వామి జాతర, స్వామివారి రథోత్సవ కార్యక్రమాలపై అధికారి, జిల్లాపర్యాటక శాఖాధికారి గురువారం జాతర ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతిసంవత్సరం స్వామివారి రథోత్సవానికి ఇతర రాష్ట్రాల నుంచి వివిధ జిల్లాల నుంచి అనేక గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. జాతరకు విచ్చేసే పర్యాటకులకు 5స్పీడ్ బోట్లు ఏర్పాటు చేసేవిధంగా చేస్తామన్నారు. అదేవిధంగా రాత్రివేళల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులు, మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఈవో జైపాల్‌రెడ్డి, పర్యాటకశాఖ జిల్లా అధికారి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యాదవ భవననిర్మాణ అధ్యక్షుడిగా కాశన్నయాదవ్

బల్మూరు, డిసెంబర్ 26 : అచ్చంపేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న తాలుకా యాదవ భవన నిర్మాణం అధ్యక్షుడిగా మండలంలోని చెన్నారం చెందిన కాశన్న యాదవ్‌ను ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదవ భవన నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. భవనం త్వరగా పూర్తికావాలంటే సంఘంలోని దాతలు ముందుకొచ్చి అన్నివిధాలా ఆర్థిక సాయం అందించాలన్నారు.

మహాసభలు జయప్రదం చేయాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

అచ్చంపేట, డిసెంబర్ 26 : నల్గొండలో ఈ నెలా 28, 29, 30 తేదీల్లో యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు జరుగనున్నాయని యూటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు కృష్ణ ప్రకటనలో తెలిపారు. మహాసభలకు పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆన్‌డ్యూటీ మంజూరు చేసిందని తెలిపారు. రెండేండ్ల కోసారి జరిగే రాష్ట్ర మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో సమ్మెచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను ప్రభుత్వం విరమించుకోవాలని పేర్కొన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్ష ఉద్యోగులు, ఆశ్రమ పాఠశాలల సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కేజీబీవీల్లో విద్యాబోధన కుంటుపడిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శివాలయానికి విరాళాలు

వెల్దండ, డిసెంబర్ 26 : మండలంలోని శివునిగుట్టపై ఉన్న ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ముందకొచ్చారు. మాజీ ఎంపీటీసీ నిరంజన్ రూ.20వేలు, శేఖర్ రూ.10వేలు, నారాయణరెడ్డి రూ.10వేలు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు యాదగిరి రూ.10 వేలు, తిర్పతినాయక్ రూ.5వేలు, అంజయ్య రూ.5వేలు, రంగయ్య రూ.10వేలు, శ్రీశైలం రూ.5వేల చొప్పున రూ.75 వేలు విరాళం అందజేసినట్లు నిర్వాహకులు వెంకటేశ్ తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్ ప్రమాణస్వీకారం వాయిదా

అచ్చంపేట, డిసెంబర్ 26 : జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా గంగాపురం రాజేందర్ ఈనెల 28న ప్రమాణస్వీకారం నిర్వహిచాల్సి ఉండగా వాయిదా పడింది. నూతన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవంతో పాటు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం వాయిదా పడినట్లు రాజేందర్ తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని తదుపరి తేదిని ప్రకటిస్తామని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 26 : మండలంలోని దేవునితిర్మలాపూర్‌కు చెందిన వెంకటయ్య కుటుంబానికి గురువారం బీఆర్ఎస్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ విజ్ఞత, మాజీ ఉపసర్పంచ్ చంద్రశేఖర్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామనాయకులు యాదగిరి, ఎద్దుల కురుమయ్య, ఈశ్వరయ్య, రాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా అసమానత వ్యతిరేకదినం

ప్రతులను దహనం చేస్తున్న సంఘం నాయకులు

అచ్చంపేట, డిసెంబర్ 26 : అంబేద్కర్ స్ఫూర్తితో జైభారత్ ఆధ్వర్యంలో అసమానత వ్యతిరేక దినం నిర్వహించినట్లు జైభారత్ జైహో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్ దున్న అన్నారు. గురువారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద అన్ని మత గ్రంథాలలోని వివక్షతలు గల గ్రంథాన్ని దహనం చేసి అసమానత వ్యతిరేక దినం నిర్వహించారు. అంబేద్కర్ స్ఫూర్తితో డిసెంబర్ 26న అసమానత వ్యతిరేక దినం జరుపడం జరుగుతుందని తెలిపారు. నేడు అన్ని మతాలలోను వివక్షతలను దహనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మహబూబ్‌అలీ, పోలేరవి, విశ్వంత్‌భరత్, ఉప్పరి బాలరాజు, మహేష్, ప్రవీణ్, శంకర్, శివ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రెండురోజులు జైలుశిక్ష

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 26 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పోలికపాడు గ్రామానికి చెందిన బొల్లె నాగయ్యకు గురువారం కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు రెండురోజుల డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజులు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నాయినోనిపల్లి మైసమ్మ వద్ద నాగయ్య మద్యం తాగి వాహనం నడిపి పట్టుపడ్డాడు. గురువారం కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి జ్యోత్స్నగుంటి నాగయ్యకు శిక్షతోపాటు, జరిమాన విధిస్తూ తీర్పును ఇచ్చింది.